క్లుప్తంగా

బొండాడలో రాధాకృష్ణుల గ్రామోత్సవం

కాళ్ల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా కాళ్ల మండలం బొండాడ గ్రామంలో రాధాకృష్ణులకు బుధవారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో పలురకాల విచిత్ర వేషధారణలు, కేరళ సంప్రదాయ డప్పులు, తీన్మార్ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. స్వామివారి దర్శనం కోసం వీధుల్లో భక్తులు బారులు తీరారు. కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం భారీ అన్నసమారాధన ఏర్పాటుచేయనున్నట్లు యువజన కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాల పనుల పరిశీలన

వీరవాసరం: స్థానిక భవిత కేంద్రాన్ని, రాయకుదురు కవురు వారి వీధి ప్రాథమిక పాఠశాలను ఎస్ఎస్ఏ ఏపీసీ పి.శ్యాంసుందర్ బుధవారం సందర్శించారు. కవురు వారి వీధి పాఠశాల ప్రహరీ అసంపూర్తిగా ఉందనే విషయాన్ని గ్రామస్తులు ప్రశ్నించడంతో పాఠశాల మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్నందున్న త్వరలోనే ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇస్తామని తెలియజేశారు. హెచ్ఎం డి.పుల్లారావు, ఎం.జయలక్ష్మి ఏపీసికి వివరాలను తెలియజేశారు. అనంతరం భవిత సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు.

బదిలీలకు రంగం సిద్ధం

ఆకివీడు : మండలంలోని పలువురు అధికారులు, కార్యదర్శులు, ఇతర సిబ్బంది బదిలీలకు ఈ నెల 30న రంగం సిద్ధం చేశారు. ఎన్నికల అనంతరం ఆయా మండలాలకు తిరిగి వచ్చిన అధికారులు, సిబ్బందిని మళ్లీ బదిలీ చేయనున్నారు. ఎంపీడీఓ, పంచాయతీరాజ్ ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ, బీడీఓ, పలువురు కార్యదర్శులు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ఇప్పటికే తమ బదిలీ ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. ఆర్డర్లు వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాలకు వెళ్లనున్నారు. ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీలను నిలుపుదల చేసినట్టు తెలిసింది.

గణేష్ ఉత్సవాలకు ముహూర్తం

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలకు పట్టణం, గ్రామాల్లోనూ పందిళ్లు వేసేందుకు ముహూర్తం పూజ బుధవారం నిర్వహించారు. స్థానిక కనకదుర్గమ్మ పూలు పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పందిళ్లు వేసేందుకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద, సాలిపేటలోనూ, దుంపగడప రైల్వే గేటు ప్రాంతంలోని జవహర్‌పేటలోనూ ముహూర్తం పూజలు చేశారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

భీమవరం: పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద బుధవారం విద్యుత్ అమరవీరులు రామకృష్ణ బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి సంతాప సభ జరిగింది. ముందుగా అమరవీరుల చిత్రపటాలకు సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు జెఎన్‌వి గోపాలన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బలరాం, గోపాలన్ మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేస్తే దానికి వ్యతిరేకంగా వంద రోజులు పాటు సుదీర్ఘ పోరాటం అనంతరం బషీర్‌బాగ్‌లో ప్రభుత్వం ధమనకాండ జరిపిందని దాని ఫలితంగా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా అనేకమంది గాయపడ్డారన్నారు. కార్యక్రమంలో జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, ప్రజా సంఘాల నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, గోపాలరాజు, డి.త్రిమూర్తులు, ఎ.రాంబాబు, రత్నకుమారి పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టడంలో విఫలం

భీమవరం: ఇటీవల కాలంలో పరిశ్రమల్లో పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్ విమర్శించారు. భీమవరంలో బుధవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగిన సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఫ్యాక్టరీల్లో తనిఖీలు లేకుండా యాజమాన్యాలకు అనుకూలమైన చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. సమావేశంలో బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, కర్రానాగేశ్వరరావు, సిరపరపు రంగారావు, జవ్వాది శ్రీనివాస్, మండల సూరిబాబు, ఇంజెటి శ్రీను పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు అవగాహన సదస్సు

వీరవాసరం: మండలంలోని రాయకుదురు పంచాయతీ కార్యాలయంలో ఆక్వా రైతులకు ఏపీఎస్ఏడీఏ అనుమతులు , ఎంపెడా ఎన్‌రోల్‌మెంట్ పై అవగాహన కల్పించారు. ఎంపెడా అధికారి గోపాలకృష్ణ, వీరవాసరం మత్స్య శాఖ అభివృద్ధి అధికారి, ఏడీ భీమవరం-1 శ్రీనివాస్ రావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గెద్దం భారతి, వీరవాసరం గ్రామ మత్స్య శాఖ సిబ్బంది బాల నాగేశ్వరరావు, వెంకటేశ్,కిషోర్ వర్మ పాల్గొన్నారు.

ఆలయం ప్రారంభం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని బుధవారం మార్కెట్‌లో ఆధునికీకరించిన వరసిద్ధి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఇటీవల ఆలయ ఫ్లోరింగ్‌ను గ్రానైట్‌తో ఆధునికీకరించారు. ఆలయాన్ని ప్రారంభించిన గ్రంధిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.



భయం..భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం



కోల్‌కతాలో జరిగిన ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార సంఘటన చాలా బాధాకరం. రాత్రి సమయాల్లో అత్యవసరమైతే భయం..భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలంటే ప్రభుత్వం చట్టాలను మరింత కఠినతరం చేయాలి. ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉండే వైద్య సిబ్బందికి మరింత రక్షణ కల్పించాలి. కోల్‌కతా లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– కె ప్రశాంతి, జనరల్ సర్జన్, నరసాపురం ఏరియా ఆసుపత్రి

సెక్యూరిటీ కల్పించాలి



కోల్‌కతాలో మహిళా వైద్యురాలు హత్య విషయం తెలిసిన తర్వాత విధులు నిర్వహించాలంటే భయపడుతున్నాం. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో గర్భిణులకు సీరియస్ అయితే వారి వెంట వచ్చి ఆస్పత్రులో చేర్పించి తిరిగి ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఒంటరిగా ప్రయాణిస్తున్నాం. అత్యవసర సమయాల్లో స్థానిక పోలీసుల ద్వారా మాకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పి.నాగమణి, ఏఎన్ఎం, కొంతేరు

ఇళ్లను కూల్చేశారు

- అయిభీమవరం రోడ్డులో పోలీస్ బలగాల మొహరింపు
- భయంతో ఖాళీ చేసిన ఆక్రమణదారులు
- నిర్బంధంలో సీపీఎం నాయకులు



స్థానిక అయిభీమవరం రోడ్డులో స్వచ్ఛందంగా ఆక్రమణ ఇళ్లు తొలగించుకుంటున్న బాధితులు



అయిభీమవరం రోడ్డులో ఆక్రమణలు తొలగించిన దృశ్యం



సీపీఎం నాయకులు నిర్బంధించిన దృశ్యం

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డు మార్జిన్‌లో 42 మంది ఇళ్లు గంటల వ్యవధిలోనే కుప్పకూలిపోయాయి. పక్కా ప్లాన్‌తో ఈ ఆక్రమణల తొలగించారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ఆదేశాలతో మంగళవారం రెవెన్యూ, నగర పంచాయతీ, పోలీస్ అధికారులు రంగంలోకి దిగినప్పటికీ సీపీఎం నాయకుల అండతో బాధితులు ఆందోళనకు దిగారు. వారం రోజులు గడువులోపు ఖాళీ చేయాలని కూటమి నాయకులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఐతే, ఎమ్మెల్యే పట్టుదలతో ఆక్రమణల్ని గంటల వ్యవధిలో ఖాళీ చేయించాలని అధికారుల్ని ఆదేశించడంతో బుధవారం తెల్లవారుజాము నుంచి బాధితులు స్వచ్ఛందంగా తమ ఇళ్లను ఖాళీ చేయడం ప్రారంభించారు. రేకు షెడ్లు, పక్కా భవనాలున్నవారి తమ కలపను తొలగించుకున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో మూడు జేసీబీలు రంగంలోకి దిగి ఇళ్లను కూల్చివేశాయి. బాధితులకు అండగా ఉన్న సీపీఎం నాయకుల్ని తెల్లవారు జామునుండే గృహనిర్బంధం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆక్రమణల తొలగింపు పూర్తయిన తరువాత వారిని విడుదల చేశారు. ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, ఎస్సై నాగరాజు, మరో ముగ్గురు ఎస్సైలు స్థానిక పోలీసుల బందోబస్తు మధ్య ఇళ్లను తొలగించారు.

భయభ్రాంతులకు గురిచేశారు

అయిభీమవరం రోడ్డులోని ఆక్రమణల తొలగింపులో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పోలీసులు స్థానిక ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశారని సీపీఎం నాయకుడు తవిటినాయుడు ఆరోపించారు. బాధితులకు అండగా నిలిచిన సీపీఎం నాయకుల్ని తెల్లవారుజామున అరెస్టు చేసి, స్టేషన్‌లో కూర్చోబెట్టడం దారుణమని వాపోయారు. పోలీసుల చర్యల్ని నిరసిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సాయంత్రం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బైఠాయించారు. నాయకుల్ని వెంటనే విడుదల చేయాలని నినదించారు. పెత్తందార్లు, బడా బాబులకోసం ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు పేదల ఇళ్లు కూల్చివేయించారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సందక సూరిబాబు, బి.కల్యాణి, దొడ్డి పద్మ, పంపన కృష్ణవేణి, బి.అప్పలనాయుడు, పద్మనాభం, లక్ష్మణరావు, ఉమా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా జ్వరపీడితుల గుర్తింపు



దుంపగడపలో దోమ నివారణ చర్యల్ని వివరిస్తున్న మలేరియా అధికారి శ్రీనివాసరావు

ఆకివీడు : మండలంలోని దుంపగడప గ్రామంలో దోమల బెడదతో జ్వరాల బారిన పడుతున్న వారిని ఇంటింటికీ వెళ్లి గుర్తిస్తున్నట్టు పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కొత్తగా జ్వరంతో ఆరుగురు వైద్యం పొందినట్టు ఆయన చెప్పారు. గ్రామంలో ఎనిమిది బృందాలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నాయన్నారు. సర్వే బృందంతో పాటు మలేరియా అసిస్టెంట్ అధికారి పి.శ్రీనివాసరావు గ్రామంలో పర్యటించారు. దోమ లార్వా పెరుగుతున్న నీటి నిల్వల్ని గుర్తించి వెంటనే వాటిని నాశనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పేదలు విద్య ద్వారానే అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తారని దీనికి దాతల సహకారం ఎంతో అవసరమని మంతెన రామలింగరాజు అండ్ కాంతమ్మ(ఎంఆర్ఎల్ఆర్ అండ్ కె) ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ రాజు, ఫౌండర్ సెక్రటరీ ఎం .రామలింగరాజు అన్నారు. ఫౌండేషన్ 50వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మంతెన రామలింగరాజు నివాసం వద్ద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ కార్యదర్శి సిహెచ్ జాన్సీలక్ష్మి మాట్లాడుతూ ఎంఆర్ఎల్ఆర్ అండ్ కె ఫౌండేషన్ ద్వారా ప్రతి ఏటా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని దీనిలో భాగంగా ఈ ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులు ఇరువురు, ఇంజినీరింగ్ విద్యార్థులు 60 మంది, బీఫార్మసీ విద్యార్థులు ముగ్గురు, పాలిటెక్నికల్ విద్యార్థులు ఇరువురు, చార్టెడ్ అకౌంటెంట్ విద్యార్థి ఒకరు, పీజీ విద్యార్థులు 11 మంది, డిగ్రీ విద్యార్థులు 6గురు, నీట్ విద్యార్థి ఒకరు, లా విద్యార్థి ఒకరు, ఐటీఐ విద్యార్థులు 7గురు మొత్తం 94 మంది విద్యార్థులకు రూ. 9.35 లక్షల స్కాలర్‌షిప్‌లుగా ఇస్తున్నట్లు వివరించారు. అలాగే పట్టణంలోని త్యాగరాజ ఉత్సవాల నిర్వహణకు రూ. 10 వేలు, చైతన్యభారతి నాటకోత్సవాలకు రూ. 15 వేలు, అల్లూరి సీతారామరాజు సేవా సమితికి రూ. 30 వేలు, ఐ భీమవరం జెడ్పీస్కూల్ విద్యార్థులకు రూ. 13 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గాదిరాజు సుబ్బరాజు, ఉద్దరాజు వేణుగోపాలరాజు, గోకరాజు పాండురంగరాజు, ముదునూరి సూర్యనారాయణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, కొత్తపల్లి శివరామరాజు, డీవీఎస్ చంద్రజీ, చెరుకువాడ రంగసాయి, బి బలరామ్, ఇందుకూరి ప్రసాదరాజు తదితరులుప పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను పునఃపరిశీలించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

ఆకివీడు : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని మాల సంఘం జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు మాట్లాడుతూ మాలజాతి ఐక్యతతో వర్గీకరణను వ్యతిరేకించాలన్నారు. మంద కృష్ణ చేస్తున్న ప్రకటనలు దుర్మార్గమని నోరు అదుపులో పెట్టుకోవాలని ఆయన హెచ్చరించారు. జాతి కోసం తాము నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు. వర్గీకరణను నిలుపుదల చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, నవంబర్ నెలలో 10 లక్షల మందితో విజయవాడలో ఉద్యమం చేపడతామని తెలిపారు. జేఏసీ జిల్లా ఆర్గనైజర్ కోన జోసఫ్ మాట్లాడుతూ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలంతా ఒకటిగా నిలబడాలన్నారు. 2004లో వర్గీకరణ చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చి, అందరూ కలిసి ఉండాలని సూచిస్తే, నేడు వర్గీకరణకు తీర్పు ఇవ్వడం దారుణమని ఆరోపించారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు కటికతల రాజారావు, గాలి సామ్రాజ్యం, ఎరిచర్ల గ్లాడ్‌సన్, అయిభీమవరం రాజు, జి.ధనరాజు, ఈది రవి కుమార్, చిగురుపాటి చిట్టిబాబు, విజయ్, సుధాకర్, సువర్ణరాజు, రంజిత్, గాతల సందీప్, ప్రమీల, మెరుగు దీనమనస్సు, ఆధార్‌కార్డు రాజు, అనిత, సత్యవేణి, సోడదాసి జైపాల్, క్రాంతి చరణ్ పాల్గొన్నారు.

2 నుంచి సభ్యత్వ నమోదు

ఉండి: వచ్చేనెల 2వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, అక్టోబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లూరి సాయిదుర్గరాజు తెలిపారు. బుధవారం ఉండిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4లక్షల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నా మని తెలిపారు.నాయకులు తోట గంగరాజు, కొమ్మన నాగబా బు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, ఎం నాగరాణి, లక్ష్మీపార్వతీ పాల్గొన్నారు.

పశువుల సమాచారం తప్పకుండా ఇవ్వాలి



జాతీయ పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: సెప్టెంబర్ 1 నుంచి 21వ జాతీయ పశుగణనను ప్రారంభిస్తున్నారని రైతులు, పశు పెంపకం దారులు తమ పశువుల గురించి తప్పకుండా సమాచారం ఇవ్వాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 21వ జాతీయ పశుగణన పోస్టర్‌ను ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సంబంధించి కచ్చితమైన లెక్క చెబితే దానిననుసరించే వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. మండల పశువైద్యాధికారి పి. పుండరీబాబు మాట్లాడుతూ పశు గణన ప్రతి ఐదేళ్లకోసారి జరుగుతుందని తొలుత ఈ గణన 1919-1920 లో ప్రారంభించారన్నారు. పశుగణన చేపట్టే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికీ తిరిగి గేదెలు, ఆవులు, వాటి జాతులు, పందులు, కుక్కలు, తదితర పశు జాతులను నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, తహసీల్దార్ రావి రాంబాబు, ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాసాగుకు అనుమతులు తప్పనిసరి



కేవీకేలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సు

ఉండి: ఆక్వాసాగు చేస్తున్న రైతులంతా అప్సడా (ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ), ఎంపెడా (మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ)లో విధిగా నమోదు చేసుకోవాలని ఎఫ్‌డీఓ ఎం రాంబాబు, అప్సడా ఏడీ ఆనంద్‌కుమార్ అన్నారు. బుధవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో అప్సడా అనుమతులు, ఎంపెడా ఫార్మ్ ఎన్‌రోల్‌మెంట్‌పై ఆక్వా రైతులు, డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఆక్వా చెరువులు తవ్వేందుకు, సాగు చేసేందుకు అప్సడాలో అనుమతులు పొందేందుకు ఎకరాకు రూ.వెయ్యి చెల్లించాలన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌తో ఆక్వాసాగులో తలెత్తే సమస్యల పరిష్కారం, రసాయనాలు, మందులు, మేతల వల్ల కలిగే నష్టాలపై ఫిర్యాదు చేయవచ్చని, విద్యుత్ సబ్సిడీ, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో కూడా సబ్సిడీ లభిస్తుందని వివరించారు. ఎంపెడాలో నమోదుకు ఐదెకరాల్లోపు రైతులు రూ.వెయ్యి చెల్లించాలని తెలిపారు. ఈ నమోదుతో ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు అనుమతి లభిస్తుందన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, గుర్తింపు పొందిన హేచరీల్లోనే సీడ్ కొనుగోలు చేయాలని సూచించారు. అధికారుల సూచనల మేరకే మేతలు, మినిరల్స్, మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో కేవీకే మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాస్, ఆక్వా రైతులు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కందుల బలరామకృష్ణ, గాదిరాజు వెంకటేశ్వరరాజు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్‌లు కె.రాజేష్, ఎం సూర్యప్రకాష్, టి.భారతి, ఎన్ రాజేష్ పాల్గొన్నారు.


భావ వ్యక్తీకరణకు భాష ఎంతో అవసరం

భీమవరం (ప్రకాశంచౌక్): అన్ని భాషలతో పరిచయాలు సంబంధాలు ఉన్నా శ్రీకృష్ణదేవరాయలు మన దేశంలో ఎన్ని భాషలున్నా తెలుగు భాషకు సాటి లేదని అన్నారని, తెలుగుకవుల రచనలు గ్రంథాలుగా కళాఖండాలుగా చరిత్రలో యుగాంతం వరకు నిలిచిపోతాయని భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తెలుగుభాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో తెలుగు భాషా ఔన్నత్యంపై సదస్సు, తెలుగు రచయితలు, తెలుగు ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. భావ వ్యక్తీకరణకు భాషా అవసరమని, ప్రపంచంలో అనేక భాషలున్నాయని, మన తెలుగు భాష నుంచి సంస్కృతి సంప్రదాయాలు కూడా తెలియజేస్తుందని కమిషనర్ రామచంద్రరెడ్డి అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అమెరికా వంటి అగ్రరాజ్యాల్లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం మన తెలుగు జాతికే గర్వకారణమని అన్నారు. పట్టణంలోని 26 మంది కళాశాల, ప్రాథమిక పాఠశాలలోని రచయితలను, తెలుగు ఉపాధ్యాయులను సత్కరించి ప్రశంసా పత్రాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో వడ్డీ సుబ్బారావు, కలిగొట్ల గోపాల శర్మ, డా గాదిరాజు రంగరాజు, తెలుగు శాఖధిపతి నాచు శ్రీవల్లి, అనసూయ, సంఘం సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు గిడుగు రామ్మూర్తి జయంతి

ఉండి: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం ఉండి జెడ్పీ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ఎం శివరామరాజు తెలిపారు. తెలుగు భాష ప్రాముఖ్యతపై కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, ఉపాధ్యాయులను సత్కరిస్తామని పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: ప్రభుత్వానికి ప్రజలకు ప్రతినిధులుగా ఉన్నామని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని రెండు గ్రామాలలో లే అవుట్‌లలో ఇళ్లు నిర్మించుకోలేదని వారిని నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేవనెత్తిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నార్జీఎస్ నుంచి రూ.6 కోట్లు నిధులు మంజూరవుతాయని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం దిశగా కృషి చేద్దామన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మల సహకారంతో మండలంలోని గ్రామాలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర పాలకవర్గాలు కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు మాట్లాడుతూ వర్షాలు పడుతున్నాయని గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ రావి రాంబాబు మాట్లాడుతూ సెప్టెంబర్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని భూ వివాదాలు పరిష్కరిస్తామన్నారు. వ్యవసాయ శాఖ ఏఓ నిమ్మల శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ శశికుమార్, మండల పశువైద్యాధికారి పి. పుండరీబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దుర్గారావు, రవాణ శాఖ అధికారి రవికుమార్, ఎలక్ట్రికల్ ఏఈ ఇతర అధికారులు తమ శాఖలోని అభివృద్ధి గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు ఆరేటి సత్యవెంకట వీరాస్వామి నాయుడు, బూరబత్తుల రామ్మూర్తి, మండల కోఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్, ఎంపీటీసీలు తిరుమాని తులసీరావు, బొమ్మిడి కొండరాజు పాల్గొన్నారు.

నేడు నాక్ బృందం రాక

ఆకివీడు : మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బృందం గురువారం రానున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత తెలిపారు. కళాశాలలో విద్యా విధానం, భౌతిక అభివృద్ధి, విద్య ద్వారా ఉన్నత స్థితికి చేరుకున్న వారి వివరాలతో పాటు సమావేశాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 30వ తేదీన కూడా నాక్ బృందం కళాశాలలో తనిఖీ చేయనున్నట్టు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు

భీమవరం: పట్టణంలోని 24వ వార్డుకు చెందిన యువకుడు కన్పించడం లేదంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై ఎం.రామకృష్ణ బుధవారం విలేకరులకు తెలిపారు. పట్టణానికి చెందిన ఎస్.వెంకటసత్యనారాయణ స్థానికంగా ఒక మెడికల్‌షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 24న షాపునకు వెళ్లిన సత్యనారాయణ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని తల్లి కుమారి పోలీసులను ఆశ్రయించింది.